క్లుప్తంగా

నీరు నిల్వ ఉండకుండా చూడాలి



పనులను పరిశీలిస్తున్న కమిషనర్ రమేశ్

సుల్తానాబాద్: సీజనల్ వ్యాధులు రాకుండా ఉండేందుకు నీరు నిల్వ లేకుండా చూడాల్సిన బాధ్యత మున్సిపల్ పారిశుధ్య కార్మికులతో పాటు ఇంటి యజమానులపై ఉందని మున్సిపల్ కమిషనర్ రమేశ్ అన్నారు. మున్సిపల్ పరిధిలో వందరోజుల ప్రణాళికలో భాగంగా బుధవారం 2, 13వ వార్డుల్లో పారిశుధ్య పనులను ఆయన పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ చెత్తను రోడ్లపై వేయకుండా ట్రాలీ, ట్రాక్టర్ వచ్చినప్పుడు తడి, పొడి చెత్తగా రెండు డబ్బాల్లో వేరు చేసి స్వచ్ఛ ఆటోలకు అందించాలని కోరారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్ నాగరాజు, సిబ్బంది శ్రావణ్‌కుమార్, రాజ్‌కుమార్, శశికుమార్ పాల్గొన్నారు.

వాటర్ ట్యాంక్‌కు మెట్లు ఏర్పాటు చేస్తాం

మున్సిపల్ పరిధిలో ఉన్న 14వ వార్డులో వాటర్ ట్యాంక్ మెట్లు దెబ్బతిన్నాయని, వాటికి మరమ్మతు చేపిస్తామని మున్సిపల్ కమిషనర్ తిప్పరాజు రమేశ్ తెలిపారు.

అయ్యప్పస్వామికి అభిషేకం



జ్యోతినగర్: అయ్యప్పస్వామి జన్మ నక్షత్రమైన ఉత్తర నక్షత్రంను పురస్కరించుకొని ఆలయంలో పూజలు చేశారు. ఎన్టీపీసీ రామగుండం పర్మినెంట్ టౌన్‌షిప్ వైకుంఠపురం హరిహర దేవాలయ ప్రాంగణంలోని అయ్యప్పస్వామి ఆలయంలో అర్చకులు వామనశర్మ విశేష పూజలు చేశారు. అఖిల భారతీయ అయ్యప్ప ధర్మ ప్రచార సభ సభ్యుడు జనగామ తిరుపతి, ఆలయ కమిటీ సభ్యులు సంపత్‌రావు, గురుస్వాములు వేదాంతం శేషుకుమార్, శ్రీధర్, శ్రీనివాస్, మణికంఠ, రమాకాంత్ పాల్గొన్నారు.

పిచ్చిమొక్కల తొలగింపు

ఫెర్టిలైజర్‌సిటీ: రామగుండం కార్పొరేషన్ పరిధిలో 100 రోజుల ప్రణాళికలో భాగంగా బుధవారం కార్పొరేషన్ 14వ డివిజన్ వీర్లపల్లిలోని చెరువు కట్టపై ఇరువైపులా ఉన్న ముళ్ల పొదలను నగరపాలక సంస్థ తొలగించింది. వార్డ్ ఆఫీసర్ సాయి, శానిటరీ ఇన్‌స్పెక్టర్‌రంగు నాగభూషణం, శానిటరీ సూపర్‌వైజర్ ఆడెపు శ్రీనివాస్ పాల్గొన్నారు.

పారిశుధ్యంపై శ్రద్ధ చూపాలి

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి మండలంలోని గ్రామాల్లో పారిశుధ్య పనులను మెరుగుపర్చడంపై శ్రద్ధ చూపాలని ఎంపీడీవో శ్రీనివాస్ అన్నారు. మండలంలోని బ్రాహ్మణపల్లి రైతువేదికలో బుధవారం పంచాయతీ కార్యదర్శులతో సమావేశమై పలు సూచనలు చేశారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఏపీవో రమేశ్ తదితరులు ఉన్నారు.

ఆర్టీసీ బస్టాండ్‌లో ఉచిత వైద్యశిబిరం

ధర్మారం: మండల కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్‌లో బుధవారం మెడికవర్ ఆసుపత్రి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ గ్రామాలకు ప్రయాణిస్తున్న వారికి వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ శిబిరంలో 310 మందికి షుగర్, బీపీ పరీక్షలు చేశారు. ఆసుపత్రి సిబ్బంది గుర్రం కిరణ్, కోట కరుణాకర్, శ్రీకాంత్, మహేశ్ పాల్గొన్నారు.

ఎన్నికల నిర్వహణపై అవగాహన



ఓటుహక్కు వినియోగించుకుంటున్న విద్యార్థులు

గోదావరిఖనిటౌన్: విద్యార్థి దశ నుంచే నాయకత్వ లక్షణాలు, ఎన్నికల నిర్వహణపై అవగాహన పెంచేలా గోదావరిఖని రమేశ్‌నగర్‌లోని వాసవ్య విద్యాలయంలో బుధవారం స్కూల్ కౌన్సిల్ ఎన్నికలు నిర్వహించారు. ఓటర్ల నమోదు, తుది జాబితా ప్రకటన, నామినేషన్లు, ఎన్నికల నిర్వహణ తదితర అంశాలపై అవగాహన కల్పించేలా ఎన్నికలు నిర్వహించారు. పాఠశాల డైరెక్టర్ విక్రంవర్మ ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత

కమాన్‌పూర్: మండల కేంద్రానికి చెందిన నగునూరి అనిల్‌కు తనతోపాటు పదో తరగతి వరకు చదువుకున్న మిత్రులు బుధవారం రూ.10వేలు అందజేశారు. అనిల్‌కు మెదడులో రక్తం గడ్డికట్టడంతో ఇటీవల ఆస్పత్రిలో చికిత్స చేయించుకొని ఇంటికి రాగా అతనితో చదువుకున్న తోటి మిత్రులు ఆర్థికసాయం అందజేశారు. సీహెచ్.చంద్రశేఖర్, సురేశ్, అగ్గిమల్ల సతీశ్, సుమన్ పాల్గొన్నారు.



ఇసుక నిల్వలతో ఇబ్బంది..

సుల్తానాబాద్: మండల కేంద్రంలోని మినీ కలెక్టరేట్‌లోఉన్న వివిధ కార్యాలయాల పక్కన ఇసుక నిల్వలు ఉన్నాయి. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మానేరులో నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్లను తహసీల్దార్ సిబ్బంది పట్టుకొని భారీగా జరిమానా విధించడంతో పాటు ఇసుకను అక్కడే వదిలి పెట్టేలా అధికారులు ఒత్తిడి తెచ్చారు. దీంతో ఇసుక నిల్వలు అధికంగా ఉండడంతో కార్యాలయాలకు వచ్చే ప్రజలకు తీవ్ర అసౌకర్యంగా ఉంటుందని ఆరోపణలు ఉన్నాయి. ఉన్నతాధికారులు చొరవ తీసుకొని ఇసుక నిల్వలకు టెండర్ వేయాలని కోరుతున్నారు.



కుదుపులతో ప్రయాణికుల పాట్లు

రామగుండం: అంతర్గాం నుంచి పొట్యాల వైపు వెళ్లే రహదారి మార్గంలోని హైదరాబాద్ మెట్రో వాటర్ పంపుహౌస్ రహదారి వద్ద నాలుగేళ్ల క్రితం ప్రధాన రహదారిని తవ్వి పైపులైన్ వేసి మట్టితో పూడ్చివేశారు. కాగా క్రమంగా వాహనాల ఒత్తిడి, వర్షాకాలంతో వరద నీరు నిలిచి ఉండదంతో తవ్విన ప్రదేశంలో కుంగిపోతోంది. ఫలితంగా వాహనాలు రాకపోకలు సాగించే క్రమంలో కుదుపులకు లోనవుతున్నాయని, గుర్తించకపోవడంతో వాహనాలు అదుపు తప్పుతున్నాయని వాహనదారులు వాపోతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి రహదారిపై తారు వేసి పునరుద్ధణ చర్యలు చేపట్టాలని వాహనదారులు కోరుతున్నారు.

మంథని గ్రంథాలయాన్ని మోడల్‌గా మారుస్తాం



వినతిపత్రం అందిస్తున్న విద్యార్థులు

మంథని: జిల్లాలోని గ్రంథాలయాలను అభివృద్ధి చేస్తామని. .మంథని మోడల్‌గా తీర్చిదిద్దనున్నట్లు జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంతటి అన్నయ్య గౌడ్ అన్నారు. మంథనిశాఖ గ్రంథాలయాన్ని బుధవారం ఆయన స్థానిక గ్రంథాలయ సిబ్బంది, ప్రజాప్రతినిధులు, నాయకులతో కలిసి పరిశీలించారు. గ్రంథాలయంలో మోటారు, మంచినీటి వసతి, షెడ్ నిర్మాణానికి మంత్రి శ్రీధర్‌బాబు రూ.10 లక్షల నిధులు కేటాయిస్తారన్నారు. ప్రస్తుతం కొనసాగుతున్న గ్రంథాలయాన్ని స్థానిక ప్రభుత్వ కాలేజీ గ్రౌండ్‌లోకి మార్చాలని కోరుతూ విద్యార్థి సంఘం నాయకుడు బెజ్జంకి డిగంబర్, ప్రజా సంఘాల నాయకులు బూడిద గణేశ్, ఆర్ల సందీప్, గొర్రంకల సురేశ్, బావు రవి, తాటి బుచ్చన్న గ్రంథాలయ సంస్థ చైర్మన్‌కు వినతిపత్రం అందించారు. విద్యుత్ నియంత్రణ మండలి సభ్యుడు శశిభూషణ్ కాచే, మంథని పీఏసీఎస్ కొత్త శ్రీనివాస్, జిల్లా ఆర్టీఏ మెంబర్ మంథని సురేశ్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు అయిలి ప్రసాద్, వర్కింగ్ ప్రెసిడెంట్ బూడిద శంకర్, నాయకులు అజీమ్‌ఖాన్, కుడుదుల వెంకన్న, సాదుల శ్రీకాంత్, ఆరెల్లి కిరణ్‌గౌడ్, మంథని రాకేశ్, ఆరెల్లి వరుణ్, గడ్డం సత్యనారాయణ, బూడిద రమేశ్, చంద్రు విజయ్, ఎరుకల సురేశ్, శ్రీనివాసు, ఫహీం, శంకర్ లింగం, తదితరులు పాల్గొన్నారు.

డివిజన్లలో 100రోజుల కార్యాచరణ కార్యక్రమాలు



ట్రేడ్ లైసెన్స్‌పై అవగాహన కల్పిస్తున్న డిప్యూటీ కమిషనర్

కోల్‌సిటీ: రామగుండం నగరపాలక సంస్థ పరిధిలోని పలు డివిజన్లలో బుధవారం 100రోజుల కార్యాచరణ ప్రణాళికలో భాగంగా వివిధ కార్యక్రమాలు చేపట్టారు. గోదావరిఖని కూరగాయల మార్కెట్‌లో చిరువ్యాపారులకు పీఎం స్వనిధి తదితర పథకాలపై అవగాహన కల్పించారు. ఆస్తి పన్ను సమస్యల పరిష్కారానికి నగరపాలక సంస్థ కార్యాలయంలో రెవెన్యూ మేళా నిర్వహించారు. కల్యాణ్ నగర్‌లోని వ్యాపారులకు ట్రేడ్ లైసెన్స్‌పై అవగాహన కల్పించారు. విలేజ్ రామగుండంలో శిథిలమైన భవనాన్ని కూల్చివేశారు. ఎఫ్‌సీఐ రోడ్డులో ఖాజీపల్లి వద్ద రహదారి పక్కన పెరిగిన ముళ్లపొదలు, పిచ్చిమొక్కలను తొలగించారు. సంజయ్‌గాంధీ నగర్‌లో రోడ్డుపై గుంతలను పూడ్చివేయించారు. నగరపాలక సంస్థ డిప్యూటీ కమిషనర్ నాయిని వెంకటస్వామి ఆయా కార్యక్రమాలను పర్యవేక్షించారు.

సంక్షిప్త వార్తలు

• ఉద్యోగ విరమణ సన్మానం

రామగుండం: అంతర్గాం మండల పరిధిలోని సోమనపల్లి, మొగల్‌పహాడ్ గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాల ఆయాలు నర్సమ్మ, సుగుణమ్మ మంగళవారం ఉద్యోగ విరమణ పొందారు. వీరిద్దరిని బ్రాహ్మణపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో సీడీపీవో రౌతు అలేఖ్యపటేల్ సన్మానించారు. అంతర్గాం మండల సెక్టార్ సూపర్‌వైజర్ అంజలి, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

• బీజేపీ పర్యావరణ పరిరక్షణ మండల కన్వీనర్‌గా శ్రీనివాస్

పెద్దపల్లిరూరల్: బీజేపీ పర్యావరణ పరిరక్షణ మండల కన్వీనర్‌గా పెద్దపల్లి మండలం గౌరెడ్డిపేటకు చెందిన బుషణవేన శ్రీనివాస్‌గౌడ్‌ను నియమించినట్లు జిల్లా కన్వీనర్ జంగ చక్రధర్‌రెడ్డి తెలిపారు. తన నియామకానికి సహకరించిన మాజీ ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి, జిల్లా అధ్యక్షుడు సంజీవరెడ్డి, జంగ చక్రధర్‌రెడ్డికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

• వారి నేత్రాలు సజీవం

పాలకుర్తి: మండల పరిధిలోని శాలపల్లి, జీడీనగర్‌లో గుండెపోటు కారణంగా బూర్ల భాగ్యలక్ష్మి (52), పానగంటి శివకుమార్ మృతిచెందారు. వారి నేత్రాలను కుటుంబసభ్యులు దానం చేశారు. భాగ్యలక్ష్మి కుటుంబసభ్యులకు నేత్రదానంపై అవగాహన ఉండటంతో విషయాన్ని సదాశయ ఫౌండేషన్ మండలాధ్యక్షుడు భీమనపల్లి పృథ్వీరాజ్‌కు తెలిపారు. దీంతో ఎల్‌వీప్రసాద్ కంటి ఆసుపత్రికి చెందిన టెక్నీషియన్ ప్రదీప్‌నాయక్ నేత్రాలను సేకరించి హైదరాబాద్‌కు పంపించారు. అదేవిధంగా జీడీనగర్‌కు చెందిన పానగంటి శివకుమార్(31) నేత్రాలను కుటుంబసభ్యులు దానం చేశారు. సదాశయ ఫౌండేషన్ సభ్యులు భూపెల్లి సాగర్ ఆధ్వర్యంలో నేత్రాలను సేకరించారు.

• న్యాయం చేయండి

జ్యోతినగర్: రామగుండం కార్పొరేషన్ మూడో డివిజన్ జంగాలపల్లె శివారులో సర్వే నంబర్ 217/ఏలో రెండెకరాల పట్టా భూమి ఉందని, సంబంధించిన అంశం కోర్టు పరిధిలో ఉందని రామగుండం ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్ మక్కాన్‌సింగ్‌కు భగవాన్ రావు కోర్టు ఉత్తర్వులు అందించి విన్నవించారు. బుధవారం డబుల్‌బెడ్రూం ఇళ్ల సముదాయం వద్ద శిలాఫలకం ఆవిష్కరణ కార్యక్రమంలో ఎమ్మెల్యేకు విన్నవించారు.

• ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలి

ధర్మారం: మండలంలోని కమ్మరిఖాన్‌పేటకు చెందిన కాదాసి మమత తనకు ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలని బుధవారం కలెక్టర్‌కు వినతిపత్రం అందించారు. నిరుపేద కుటుంబానికి చెందిన తనకు ఇల్లు మంజూరు చేయాలని కోరుతూ గత నెలలో అర్జీపెట్టగా నెలరోజుల తర్వాత స్థానిక తహసీల్దార్ గ్రామానికి వచ్చి విచారణ చేసి ఇల్లు మంజూరుకు ప్రతిపాదనలు పంపినట్లు ఆమె వివరించారు. కాగా తనకు మొదటి లిస్టులో ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయలేదని కలెక్టర్‌కు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొంది. నిరుపేదనైన తనకు ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలని విన్నవించారు.

• బీవీ పట్టాభిరాం మృతికి సంతాపం

గోదావరిఖనిటౌన్: వ్యక్తిత్వ వికాస నిపుణుడు, ప్రముఖ ఇంద్రజాలికుడు డాక్టర్ బీవీ పట్టాభిరాం ఆకస్మిక మృతిపై స్థానిక ఇంద్రజాలికుడు మేజిక్ రాజా, కళాకారులు నివాళి అర్పించి, సంతాపం తెలిపారు. బుధవారం పట్టణంలో ఏర్పాటు చేసిన సంతాప సభలో మేజిక్ రాజా మాట్లాడుతూ ఆయన మృతి ఇంద్రజాల, వ్యక్తిత్వ వికాస రంగాలకు తీరని లోటన్నారు.

• ఆర్థిక ఇబ్బందులతో వ్యక్తి ఆత్మహత్య

జ్యోతినగర్: ఆర్థిక ఇబ్బందులు తట్టుకోలేక వ్యక్తి ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్న ఘటన ఎన్టీపీసీ పోలీస్‌స్టేషన్ పరిధిలో బుధవారం చోటు చేసుకుంది. ఎన్టీపీసీ ఎస్సై టి.ఉదయ్‌కిరణ్ తెలిపిన వివరాల ప్రకారం రామగుండం కార్పొరేషన్ పరిధి ఐదో డివిజన్ మల్కాపూర్‌లో శ్రీరాముల రవి(44) సెంట్రింగ్ పనులు చేస్తూ కుటుంబంతో జీవిస్తున్నాడు. కుటుంబ ఆర్థిక పరిస్థితి సరిగా లేకపోవడంతో ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి భార్య రజిత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు. మృతుడి తల్లి రామక్క ఆరునెలల క్రితం మృతి చెందింది. ఒక కూతురు లాస్య ఉంది.

జాతీయ వైద్యుల దినోత్సవం

గోదావరిఖని: జాతీయ వైద్యుల దినోత్సవాన్ని బుధవారం స్థానిక సింగరేణి ఏరియా ఆసుపత్రిలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్లకు ప్రశంసా పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో ఆర్జీ–1 జీఎం లలిత్‌కుమార్, డాక్టర్ అంబిక, వైద్యులు మద్దిలేటి, విక్రమ్, మురళి, మల్లేశ్, సాయి ప్రియ, ఇందిర, వినోద్‌తో పాటు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పాఠ్య పుస్తకాల పంపిణీ

రామగుండం: బెస్ట్ అవైలబుల్ స్కూల్ పథకంలో భాగంగా ఎంపికైన విశ్వభారతి హైస్కూల్‌లో చదువుతున్న సుమారు 111 మంది విద్యార్థులకు ప్రభుత్వపరంగా అందాల్సిన ఉచిత పాఠ్య పుస్తకాలు, దుస్తులు, స్టేషనరీ సామగ్రి, రెసిడెన్షియల్ వసతి తదితర సౌకర్యాలు కల్పించాల్సి ఉంటుంది. కాగా బెస్ట్ అవైలబుల్ స్కూల్‌లో ఉచితంగా అందాల్సిన సౌకర్యాలను నిలిపివేయడంతో పేరెంట్స్ కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు ఈదునూరి హరిప్రసాద్ దృష్టికి తీసుకెళ్లడంతో ఈ విషయమై ఎమ్మెల్యేకు వివరించారు. దీనిపై ఎమ్మెల్యే విశ్వభారతి హైస్కూల్ యాజమాన్యానికి ఆదేశాలు జారీ చేయడంతో మంగళవారం అప్పటికప్పుడు ప్రభుత్వ నిబంధనల మేరకు సంపూర్ణ వసతులు అమలు చేశారు.

లఘు వారాహిదేవి అవతారం



అమ్మవారికి హారతి ఇస్తున్న భక్తులు

సుల్తానాబాద్: మండల కేంద్రంలోని సాంబశివాలయంలో శ్రీవారాహిదేవి గుప్త నవరాత్రులలో భాగంగా బుధవారం అమ్మవారు శ్రీలఘు వారాహిదేవి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. పుష్ప హారతి, బిల్వదళ హారతి, తులసీదళ హారతి, తదితర పూజలు చేశారు.

ఉద్యోగులు తమ పిల్లలను సర్కారు బడిలో చేర్పించాలి

కాల్వశ్రీరాంపూర్: ప్రభుత్వ ఉద్యోగులు సర్కారు బడి, చదువు మీద విశ్వాసం పెంచేందుకు తమ పిల్లలను సర్కారు బడుల్లో చేర్పించాలని ఎంఈవో మహేశ్‌కుమార్ కోరారు. మడిపల్లి కాలనీకి చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు కడారి నవీన్, మల్యాల అంగన్వాడీ టీచర్ సుమలత తమ కుమారుడు సాయి చందన్‌ను బుధవారం కాల్వశ్రీరాంపూర్ ఉన్నత పాఠశాలలో చేర్పించారు. ఈ సందర్భంగా సుమలత, నవీన్‌ను ఎంఈవో అభినందించారు.

హమాలీలు దేశవ్యాప్త సమ్మెలో పాల్గొనాలి

పెద్దపల్లిరూరల్: జిల్లాలోని గోదాములు, మార్కెట్ యార్డు, రైల్వేగూడ్స్, రైస్‌మిల్లులు, బజార్ తదితర సంస్థల్లో పనిచేసే హమాలీలంతా ఈనెల 9న నిర్వహించనున్న దేశవ్యాప్త సమ్మెలో పాల్గొనాలని హమాలీ వర్కర్స్ యూనియన్ నాయకులు గుంటి సామ్రాజ్యం, వెంకటరెడ్డి కోరారు. పెద్దపల్లిలో బుధవారం వారు హమాలీలతో సమావేశమై మాట్లాడారు. హమాలీల సంక్షేమానికి బోర్డు ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. నాయకులు సంపత్, మోహన్, శ్రీశైలం, రవి, వెంకటేశ్, శ్రీనివాస్, రాజు,రాజ్‌కుమార్, రాజేందర్ నరేశ్, తిరుపతి ఉన్నారు.

బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి పదవికి క్రాంతి రాజీనామా

మంథని: బీజేపీ ప్రాథమిక సభ్యత్వం, జిల్లా అధికార ప్రతినిధి మంథని మండల ఇన్‌చార్జి పదవికి బుధవారం రాజీనామా చేసినట్లు పోతరవేని క్రాంతి కుమార్ తెలిపారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు సంజీవరెడ్డికి రాజీనామా పత్రం సమర్పించినట్లు ఆయన తెలిపారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్ర సాధనలో కీలక భూమిక పోషించిన తెలంగాణ ఉద్యమకారుడు, పార్టీలకు అతీతంగా అందరి మన్ననలు పొందిన ప్రజానాయకుడు మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్‌ను బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిగా నియమించక పోవడం శోచనీయమన్నారు. ఈటల రాజేందర్‌కు రాష్ట్ర అధ్యక్ష పదవి ఇవ్వకపోవడంతో మనస్తాపానికి గురైన తాను పార్టీ పదవులకు రాజీనామా చేస్తున్నానని పేర్కొన్నారు.

మాజీ మేయర్‌కు పరామర్శ

గోదావరిఖని: మోకాలికి శస్త్ర చికిత్సతో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న మాజీ మేయర్ కొంకటి లక్ష్మీ నారాయణను మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్ బుధవారం పరామర్శించారు. హైదరాబాద్‌లో నిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న మాజీ మేయర్‌ను కలిసి పరామర్శించారు.

వాహనాల తనిఖీ

ఓదెల: మండలంలోని పొత్కపల్లి గ్రామంలో ఎస్సై దికొండ రమేశ్ ఆధ్వర్యంలో బుధవారం వాహనాలను తనిఖీ చేశారు.

ఆన్‌లైన్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలి



అవగాహన కల్పిస్తున్న షీటీం ఇన్‌చార్జి లావణ్య

పెద్దపల్లిరూరల్: ఆన్‌లైన్ మోసాలకు గురికాకుండా అప్రమత్తంగా ఉండాలని షీటీం ఇన్‌చార్జి ఎస్సై లావణ్య సూచించారు. పెద్దపల్లి మండలం అప్పన్నపేట జెడ్పీహైస్కూల్‌లో బుధవారం మహిళల రక్షణ, ఆన్‌లైన్ మోసాలు, యాంటీడ్రగ్స్‌పై అవగాహన కల్పించారు. వేధింపులకు గురయ్యే మహిళలు వెంటనే డయల్100కు సమాచారం అందించాలన్నారు. ఆన్‌లైన్ మోసాలకు గురైతే 1930 నంబర్‌కు సమాచారం అందించాలన్నారు. షీటీం సభ్యులు స్నేహలత, మౌనిక, సురేశ్, అశ్రిత, సింధు, అనూష, హెచ్ఎం పురుషోత్తం ఉన్నారు.

సింగరేణి వార్తలు

దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయండి



నినాదాలు చేస్తున్న కార్మిక సంఘాల నాయకులు

గోదావరిఖని: సింగరేణి కార్మికుల హక్కుల సాధన కోసం ఈనెల 9న నిర్వహించనున్న సమ్మెను విజయవంతం చేయాలని కార్మిక సంఘాల ఐక్యవేదిక నాయకులు కోరారు. బుధవారం ఆర్జీ–1 ఏరియా జీడీకే–2వ గని వద్ద ఏర్పాటు చేసిన గేట్ మీటింగ్‌లో వారు మాట్లాడారు. సమాన పనికి సమాన వేతనం చెల్లించాలని డిమాండ్ చేశారు. బొగ్గుగనుల ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా కార్మికులు పోరాడాలన్నారు. సమావేశంలో నాయకులు రామకృష్ణ, ఐ.కృష్ణ, జి.రాములు, పోగుల శేఖర్, రాజనర్సు, నరేశ్, రాజేశం, కొమురయ్య పాల్గొన్నారు.

సమ్మె పోస్టర్ విడుదల

గోదావరిఖని: సింగరేణి సమ్మెను విజయవంతం చేయాలని కార్మిక సంఘాల జేఏసీ నాయకులు కోరారు. ఈ సందర్భంగా స్థానిక భాస్కర్‌రావుభవన్‌లో పోస్టర్ విడుదల చేశారు. టీబీజీకేఎస్ అధ్యక్షుడు మిర్యాల రాజిరెడ్డి, ఏఐటీయూసీ నాయకులు మడ్డి ఎల్లాగౌడ్, సీఐటీయూ అధ్యక్షుడు తుమ్మల రాజారెడ్డి, ఐఎఫ్‌టీయూ నాయకులు విశ్వనాథ్ పాల్గొన్నారు.

కనీస వేతనం అమలు చేయాలి

దేశవ్యాప్తంగా 9న జరిగే సమ్మెను సింగరేణిలో జయప్రదం చేయాలని ఐఎఫ్‌టీయూ నాయకుడు బి.అశోక్ కోరారు. ఆర్జీ–2 జీఎం వెంకటయ్యకు బుధవారం ఆయన సమ్మె నోటీసు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం కార్మిక హక్కులు కాలరాసేలా నాలుగు లేబర్ కోడ్‌లు తీసుకొచ్చిందన్నారు. కార్మికుల సంక్షేమ కోసం ఏర్పడిన కార్మిక చట్టాలను రద్దు చేస్తూ కార్మికులను కట్టు బానిసలుగా చేసే నాలుగు లేబర్ కోడ్‌లను తీసుకరావడం మూలంగా కార్మికులకు తీరని అన్యాయం జరుగుతోందన్నారు. కాంట్రాక్టు కార్మికులకు కనీసవేతనం రూ.26వేలు ఇవ్వాలని, 8గంటల పనివిధానాన్ని కొనసాగించాలని డిమాండ్ చేశారు. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం సమానపనికి సమాన వేతనం ఇవ్వాలన్నారు. నాయకులు బుచ్చమ్మ, ఎం.లింగయ్య, పోచం, సీహెచ్ శంకర్, లక్ష్మి, రమ, లావణ్య, సదానందం పాల్గొన్నారు.

హోటళ్లలో ఆకస్మిక తనిఖీలు



తనిఖీలు చేస్తున్న మున్సిపల్ అధికారులు



జరిమానా వసూలు చేస్తున్న సిబ్బంది

పెద్దపల్లిరూరల్: జిల్లా కేంద్రంలోని హోటళ్లు, రెస్టారెంట్లలో మున్సిపల్ అధికారులు, సిబ్బంది బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. టిఫిన్ సెంటర్లు, రెస్టారెంట్లలోని ఆహార పదార్థాల్లో తరచూ క్రిమికీటకాలు ప్రత్యక్షం కావడంతో తనిఖీలు చేపట్టామని మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్ తెలిపారు. శుభ్రత పాటించని రెస్టారెంట్లను గుర్తించి రూ.32వేల వరకు జరిమానా విధించామని వివరించారు. హోటళ్లు, రెస్టారెంట్ యజమానులు శుభ్రమైన వాతావరణంలోనే ఆహార పదార్థాలు తయారు చేసి కస్టమర్లకు అందించాలని సూచించారు. నిర్లక్ష్యం చేస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

సమ్మె నోటీసులు అందజేత



సమ్మె నోటీసులు అందిస్తున్న నాయకులు

జ్యోతినగర్: దేశవ్యాప్తంగా ఈనెల 9న జరగనున్న సార్వత్రిక సమ్మెలో కార్మికవర్గం పాల్గొని విజయవంతం చేయాలని సీఐటీయూ ఆధ్వర్యంలో ఎన్టీపీసీ రామగుండం, జ్యోతినగర్ ప్రాంతాల్లోని పెట్రోల్ బంకులు, షాపింగ్ మాల్స్ యాజమాన్యాలకు సమ్మె నోటీసులు అందించారు. సీఐటీయూ ఎన్టీపీసీ రామగుండం ఏరియా కమిటీ ఆధ్వర్యంలో సమ్మె నోటీసుల పంపిణీ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు బిక్షపతి బుధవారం పాల్గొని మాట్లాడారు. పెట్రోల్ బంకులు, విశాల్ మెగా మార్ట్, మోర్ సూపర్ మార్కెట్‌లో పనిచేస్తున్న కార్మికులకు కరపత్రాలు అందించి 9న జరిగే దేశవ్యాప్త సమ్మెలో అందరూ పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. జిల్లా కోశాధికారి ఎం.రామాచారి, ఏరియా కన్వీనర్ గీట్ల లక్ష్మారెడ్డి పాల్గొన్నారు.

రోడ్లపై కేజ్‌వీల్స్‌తో ట్రాక్టర్లు నడపడం నిషేధం



మాట్లాడుతున్న తహసీల్దార్ బషీరొద్దీన్

సుల్తానాబాద్: రహదారులపై కేజీవీల్స్‌తో ట్రాక్టర్లు నడపడం నిషేధమని తహసీల్దార్ బషీరొద్దీన్ అన్నారు. ఎంపీడీవో సమావేశం మందిరంలో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ట్రాక్టర్ యాజమాన్యంతో సమావేశం నిర్వహించి కేజీవీల్స్‌తో ట్రాక్టర్లు నడపొద్దని సూచించారు. కేజీవీల్స్ యజమానులందరికీ సంబంధిత గ్రామ కార్యదర్శుల ద్వారా నోటీసులు జారీ చేయనున్నట్లు తెలిపారు. రోడ్లపై కేజీవీల్స్‌తో ట్రాక్టర్ దొరికితే మొదటిసారి రూ.5వేలు, రెండోసారి రూ.10వేలు జరిమానా, మూడోసారి రూ.20వేల జరిమానా విధించడంతో పాటు సంబంధిత చట్టాల ప్రకారం కేసు నమోదు చేస్తామని వివరించారు. ఎంపీడీవో దివ్యదర్శన్‌రావు, ఎంపీవో సమ్మిరెడ్డి, పీఆర్ ఏఈ సచిన్, ఎస్సై శ్రవణ్‌కుమార్ పాల్గొన్నారు.

ట్రాక్టర్ యజమానులతో సమావేశం

కాల్వశ్రీరాంపూర్: ట్రాక్టర్ యజమానులు కేజీవీల్స్‌తో రోడ్లపై ట్రాక్టర్లు నడిపిస్తే చర్యలు తప్పవని తహసీల్దారు జగదీశ్వర్‌రావు హెచ్చరించారు. బుధవారం ట్రాక్టర్ యజమానులతో సమావేశం నిర్వహించారు.

రైతువేదికలో సమావేశం

పాలకుర్తి: రహదారులపై కేజీవీల్స్ ట్రాక్టర్లు ఎవరైనా నడిపితే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని ఎంపీడీవో రామ్మోహనచారి తెలిపారు. మండల కేంద్రంలోని రైతువేదిక భవనంలో బుధవారం పంచాయతీ కార్యదర్శులు, వ్యవసాయాధికారులు, గ్రామ ప్రత్యేకాధికారులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన పలు సూచనలు చేశారు.

పౌష్టికాహారంతోనే ఆరోగ్యం

పెద్దపల్లిరూరల్: పోషక విలువలున్న పౌష్టికాహారం తీసుకోవడం ద్వారానే పిల్లలు ఆరోగ్యంగా ఉంటారని సీడీపీవో కవిత అన్నారు. పెద్దపల్లిలోని కేంద్రంలో చిన్నారుల తల్లిదండ్రులకు పౌష్టికాహారంపై అవగాహన కల్పించారు. సూపర్‌వైజర్ ప్రేమలత, టీచర్లు శ్రీదేవి, రేఖ పాల్గొన్నారు.

నేడు స్థానిక ఎన్నికలపై శిక్షణ

జూలపల్లి: త్వరలో జరగనున్న స్థానిక ఎన్నికలు ఎంపీటీసీ, జెడ్పీటీసీ, సర్పంచ్ ఎన్నికల నిర్వహణపై గురువారం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరంలో ఒకరోజు శిక్షణ కార్యక్రమం ఉంటుందని తహసీల్దారు స్వర్ణ తెలిపారు. మండలంలోని గ్రామాల్లో పనిచేస్తున్న బీఎల్‌వోలు (అంగన్‌వాడీ టీచర్లు) సమయానికి సమావేశంలో పాల్గొనాలని సూచించారు.

గూడెంలో బీరన్న ఉత్సవాలు

ఓదెల: మండలంలోని గూడెంలో బీరన్న ఉత్సవాలు బుధవారం వైభవంగా నిర్వహించారు. గ్రామంలో వర్షాలు కురిసి పంటలు బాగా పండాలని కోరుతూ మహిళలు బోనాలతో డప్పుచప్పుళ్లతో బీరన్న ఉత్సవాలు ఘనంగ జరుపుకున్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ గోవిందుల ఎల్లస్వామి, కురుమ సంఘం పెద్దలు రాజకొమురయ్య, బీరయ్య, ఓదెలు, కుమారస్వామి, సదయ్య పాల్గొన్నారు.

అన్నదానం

కమాన్‌పూర్: మండల కేంద్రంలోని అంగడి బజారు వద్ద ప్రతిష్ఠించిన పీరీల మసీద్ వద్ద బుధవారం నగునూరి సరిత, సంతోష్, పద్మగౌడ్‌లు అన్నదానం చేశారు. ఏటా మసీద్ వద్ద భక్తులకు అన్నదానం చేస్తున్నట్లు వారు తెలిపారు. ముజవర్ రఫీక్, సత్యం, ఫహీం, వెంకటేశ్, నారగోని సరిత, మచ్చ అనిల్, నీలం మధుకర్, పొన్నం సిద్ధార్థ, పవన్ పాల్గొన్నారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
పెద్దపల్లి జిల్లా :
9951602934
Office mail : knrjagati@gmail.com

సాక్షి
పాఠక మహాశయులకు విజ్ఞప్తి
మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా, లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నంబర్లకు ఉదయం 7.00 గం॥ల నుండి రాత్రి 8.00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
పెద్దపల్లి : కె.తిరుపతి, ACO - 7997958206
పెద్దపల్లి : ఎం.మహేందర్, SR - 9573331940
మంథని : రాజేశ్ - 9676603963
రామగుండం : ప్రశాంత్ - 9652397696
టోల్ ఫ్రీ నెం. : 1800 425 9899